# మీరూ ఆలోచించండి

-ఎస్.ఉషాపద్మిని

"ఇదుగో లక్ష్మీ! నీకీ మాట తెలుసా? ఫ్లాట్ నెంబర్ 402లో ఉంటున్న రవి, స్నేహల పెళ్లయి నాలుగు సంవత్సరాలు అయిందట. చూట్టానికి చిన్నవాళ్ళలా ఉంటారు కనుక మనం ఏదో అనుకున్నాం సుమా! ఇంకా కొత్తసంసారం గనుక పిల్లలు లేరని, కానీ నాలుగు సంవత్సరాలు అంటే ఏదైనా పద్ధతులు పాటిస్తున్నారంటావా? లేక గొడ్డుమోతులంటావా?" ఎక్కడ లేని ఆసక్తిని ముఖంలో చూపిస్తూ తన అనుమానం వ్యక్తం చేసింది కామాక్షి.

ఆమె మాటలకు అక్కడున్న మిగిలిన ఐదుగురూ బుగ్గలు నొక్కుకుని తమ సపోర్ట్ తెలియచేసారు.

"నిజంగానా వదినా, చూడ్డానికి ఎంత చిన్నపిల్లల్లా ఉంటారూ, ఎంత నాజూగ్గా ఉంటారూ. ఆ...అయినా పిల్లలా, పనులా ఏవో ఎక్సర్ సైజులు అవీ చేస్తారు కాబోలు. ఇంక బ్యూటీపార్లర్లు ఉండనే ఉన్నాయి ఆడవారికీ, మగవారికీ కూడాను. ఉన్న వయసుని ఇంకొంచెం తగ్గిస్తాయిగా" నిన్ననే బ్యూటీపార్లర్లో సర్దించుకుని వచ్చిన జుట్టు సవరించుకుంటూ అంది పొరుగింటి మాలతి.

వాళ్ళకది కొత్తకాదు ఆ అపార్టుమెంటు కట్టిన దగ్గర్నుంచీ కలిసి ఉంటున్న ఆ అరడజనుమంది ఫక్తు సగటు మహిళలు. పొద్దున్నే మొగుడికీ, పిల్లలకీ ఏదో కాస్త ఉడికించి పడేసి తర్వాత టి.వి.సీరియల్స్ మీద పడ్తారు. వాటిమీద మాత్రం ఎంతకాలం ఆధారపడ్తాం అనుకుని కాబోలు ఇలాంటి గాసిప్స్ మీద కాలం వృధా చేసేయటం అలవాటు చేసుకున్నారు. ఇదైతే పైసా ఖర్చులేని పనికదా. ఇక ఏ వర్కింగ్ ఉమెనో, లేక వీరితో అంతగా కలిసి బాతాఖానీ కొట్టని వారు వీరికి బలయిపోతుంటారు. అదే కోవకి చెందుతారు రవి, స్నేహలు. ఎమ్.ఎన్.సిలో పనిచేస్తూ క్షణం తీరిక లేకుండా ఉదయం వెళ్ళి సాయంత్రం వస్తారు. శనివారం, ఆదివారమైనా కొంత వారి వివరాలు సేకరిద్దామని ఆశపడితే ఆ రెండు రోజులు ఇంకాస్త పెందరాడే వెళ్ళి ఏ అర్థరాత్రికో ఇంటికి చేరి వీరి ఆశలు అడియాసలు చేస్తున్నారు. అదీ వారి కడుపు మంట. కొంతమందికి అవసరం ఉన్నా లేకున్నా వేరొకరి స్వవిషయాలు తెలుసుకుంటే కానీ నిద్ర పట్టదుగా. ఇంకా ఆ టాపిక్‌కి తెరదించటం ఇష్టం లేక లక్ష్మి అనే శాల్తీ అందుకుంది. "అయినా కామాక్షీ వాళ్ళిద్దరూ నిజంగా భార్యాభర్తలేనా అని నా అనుమానం. ఈ కాలంలో పెళ్ళీపెటాకులు చేసుకోకుండా డేటింగో ఏదో అంటూ కలిసి ఉండటం, తర్వాత తమకు నచ్చకపోతే వదిలి పెట్టేసి వెళ్ళిపోటం ఇలాంటివి కంపెనీలో పనిచేసేవారికి అలవాటుగా అయిందటగా. వాళ్ళు శనివారం ఆదివారం వీకెండ్ అంటూ బార్లకూ, పబ్‌లకు వాటికీ వెళ్ళి ఇష్టం వచ్చినట్లు తాగి, తిని గడుపుతారు. వాళ్ళకు నీతి,న్యాయం ఉండవట మావాడు చెప్పాడు" నాలుగేళ్ళుగా జులాయిగా తిరుగుతున్న తన కొడుకు రవి కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్ళినా సెలెక్టు చేయలేదనే అక్కసు ఇలా వెళ్ళగక్కింది లక్ష్మి.

"ఏమోనమ్మా తల్లి అని అంటూ ఎవరో ఒక్కావిడే వస్తుంది. ఇక చుట్టాలు పక్కలు ఎవరూ రారు. ఆవిడేనా చెప్పద్దూ మంచీ చెడూ" ఇలా ఇంకో గంట చర్చసాగాక పనులున్నాయంటూ ఎవరిళ్ళకు వాళ్ళుపోయారు.

స్నేహ కోసం వచ్చిన ఆమె తల్లి శారద లిఫ్ట్ పాడవడంతో మెట్లెక్కి వస్తూ వీళ్ళ మాటలు చెవిన పడటంతో మనస్సు పాడయ్యి అలాగే కూలబడిపోయింది.

సాయంత్రం స్నేహ ఇంటికి రాగానే ఎడాపెడా నాలుగూ కడిగేసింది.

"నీకు నేనెంత చెప్పినా బుద్ధి రావట్లేదేంటే? మీకేమైనా డబ్బు లేదా? కనే సామర్థ్యం లేదా? ఆరోగ్యం లేదా? ఒక పిల్లనో పిల్లాడినో కనెయచ్చుగా! నువ్వు నీ ఉద్యోగం మానేసి పెంచాలనే భయం పెట్టుకోకు. నేనే పెంచుకుంటాను అని నీకు లక్షసార్లు చెప్పాను. ఇప్పుడు మా చుట్టుపక్కల వారంతా నానారకాలుగా అనుకుంటున్నారు. అవసరం లేకుండా అనిపించుకోవాల్సిన ఖర్మ నీకేంటి? అల్లుడేదో కారణాల వల్ల అలాంటి నిర్ణయం తీసుకున్నాడనుకో అతడానివి నువ్వైనా నచ్చజెప్పి ఒక నలుసును కని తల్లి అనిపించుకో" గడ్డం పట్టుకుని అడుగుతున్న తల్లిని చూసి కూల్‌గా నవ్వేసింది స్నేహ.

"అమ్మా రిలాక్స్. లోకులు కాకులు అన్న సామెత ఉందిగా. వాళ్ళ మాటలు విని నేను పిల్లల్నికన్నా, మనం వారితో పోచుకోలు కబుర్లు చెప్పనంతకాలం వారేదో వంకతో మనని కించపరుస్తూనే ఉంటారు. అసలు వాళ్ళకి ఒక టాపిక్ కావాలి. ఇప్పుడు మేం, తర్వాత ఇంకెవరో ఇలా కొంతకాలానికి ఏం దొరక్క వారిలో వారే కొట్టుకునే రోజూ వస్తుంది. ఇంక రవి తీసుకున్న నిర్ణయం నేను అన్ని విధాలుగా ఆలోచించే మద్దతు తెలిపాను. ప్లీజ్ ఆ టాపిక్ తప్పితే వేరే ఏదైనా మాట్లాడు. అది కూడా నేను స్నానం చేసి వచ్చాక. బాగా అలసిపోయాను" అని బాత్రూంలో దూరి తలుపేసుకుంది స్నేహ.

'ఇదీ జన్మలో మారదు' అని తలకొట్టుకుని తన పనిలో పడింది శారద. ఆ రాత్రి పడుకునే ముందు రవితో అంది స్నేహ.

"అమ్మ ఏదో విందట రవి. చాలా నీచంగా మాట్లాడుకుంటున్నారు అపార్టుమెంటులో మన గురించి అని చాలా బాధపడింది. నేనేం ఫీలవటం లేదనుకో, కానీ, ఈసారి వినాలని వాళ్ళు ఏదైనా అంటే మాత్రం నేను గట్టిగా క్లాసు తీద్దామనుకుంటున్నా"

"స్నేహా వాళ్ళెవరికీ పనీ పాటా లేదు. తిని కూర్చోలేక ఇలాంటి మాటలు మాట్లాడతారు. ఇలా టైం వేస్టు చేసే బదులు ఎవరికి తోచిన పనులు వారు చేసుకోవటమో లేక భగవంతుని ధ్యానంలో గడపడమో చేయొచ్చుగా. అయినా నువ్వు మరీ సీరియస్‌గా రియాక్టు కాకు. చెప్పేలా చెప్పు. అంతే గుడ్‌నైట్" అని పడుకున్నాడు రవి.

★★★

ఇది జరిగి రెండు నెలలు కానే లేదు. స్నేహ

ఆఫీసు నుంచి వచ్చేటైముకు కాపుకాసి ఆమెను ఆపి ఇండైరెక్టుగా దాడి మొదలెట్టారా దుష్ట మూక. "హాస్పటల్‌కెళ్ళి టెస్టులు చేయించుకోమ్మా. లేకపోతే ఇంకా లోపం ఏమైనా ఉంటే టెస్టుట్యూబు పిల్లలు ఉండనే ఉన్నారుగా. మన కంటూ మనకు సంతానం లేకపోతే ఏ రకంగానూ మంచిది కాదు. ఆఖరుకు పురాణాల్లోనే చెప్పారు 'అ పుత్రస్య గతిర్నాస్తి' అని. మనం పోయాక కూడా ఉత్తమగతులు రావట పుత్రుడు లేకపోతే'' అని అందరికీ లీడర్‌లాంటి కామాక్షి అంది. ఇక ఊరుకోలేక స్నేహ అందుకుంది.

"కామాక్షిగారు ఇంత చక్కగా అర్థంతోపాటు చెప్తున్నారు కానీ ఆ పుత్రుడు మీకు లేనట్లున్నాడు. మీకిద్దరూ ఆడసంతానమేగా? మరి ఆ ఉత్తమ గతులేవో మీకు రావంటారా? అయినా ఇంకో రెండు ఛాన్సులు చూసయినా కొడుకుని కంటే సరిపోయేదేమో'' అమాయకంగా అన్నట్లు అంది.

ఉన్న పిల్లలతోనే ఖర్చు తట్టుకోలేక అప్పులపాలయిన కామాక్షి "ఈ కాలంలో అలాంటి తేడాలు లేవమ్మా. ఆడయినా, మగయినా ఒకటే'' అంది.

"అందుకేనా అలా విచ్చలవిడిగా వదిలేసారు బైట ఎక్కడ చూసినా మీ అమ్మాయిలే. ఒంటరిగా కాదులెండి. బాయ్‌ఫ్రెండ్సుతో కలిసే కనిపిస్తున్నారు'' స్నేహ అంటున్న మాటలకు ముఖం దించుకున్న కామాక్షితో "చూడండీ నేను మిమ్మల్ని కించపర్చాలని ఈ మాటలు అనటం లేదు. లోపాలూ, లొసుగులూ లేనివారు ఎవరూ లేరిక్కడ. ముందు మీ ఇల్లు మీరు చక్కదిద్దుకోక ఏ గొడవకూ రాని మమ్మల్ని మధ్యలోకి లాగి ఎందుకు కించపరుస్తారు? మీకు సంజాయిషీగా చెప్పటం లేదు, కానీ కొన్ని విషయాలు నా నోటి ద్వారా విన్నాక అయినా మీ ధోరణిలో మార్పు వస్తుందేమోనన్న ఆలోచనతో చెప్తున్నాను. అందరూ విని తీరాలి. మా రవి ఏం అంటాడో తెలుసా? కనేది ఒక పిల్లనో పిల్లాడ్నో అయినా మన పిల్లలు అనే స్వార్థం వస్తుంది. అదే మన కంటూ బంధం లేకపోతే అందరూ మనవాళ్ళే. శనివారం, ఆదివారం మీరంతా అనుకున్నట్లు మేమెళ్ళేది పబ్‌కో డిస్కోకో కాదు. మేం నడిపే అనాథ శరణాలయానికి. మా అమ్మ ఎప్పుడూ అక్కడే ఉండి శరణాలయం బాగోగులు చూసుకుంటుంది. రోడ్డుమీద కనిపడేసిన ప్రతీ అనాథ మా బిడ్డే. లక్ష్మిగారూ మీకీ సంగతి తెలుసా మీ ఇంట్లోంచి మీ నిరాదరణ భరించలేక బైటకొచ్చేసిన మీ అత్తగారు మా దగ్గరే ఉన్నారు. నాకూ తెలుసు ఇక్కడున్న అందరి జాతకాలు. కానీ నేనూ మీతో సమానం అయ్యి మా విషయాలు ఎత్తిపొడిచి మీతో సమానం కాలేను. అనాథ శరణాలయాలు నడపటం, విరాళాలివ్వటం లాంటివి అందరూ చేయాలని కాదు. మీ ఇంట్లో ఉన్న ముసలి అత్తగారిని, మామగారిని బాగా చూడండి. పిల్లలు వారిని గౌరవించేట్లు, తర్వాత అదే గౌరవం మీకు వారిచేటట్లు వారిని తయారు చేయండి. చేతనైనంతలో పక్కవారికి సాయం చేయండి. పనికిమాలిన కబుర్లతో కాలం వృథా చేయకండి'' నోళ్ళు వెళ్ళబెట్టుకుని చూస్తున్న వారిని ఓ చూపు చూసి వెళ్ళిపోయింది స్నేహ.

★

